క్లుప్తంగా

కొనసాగుతన్న ఆన్‌లైన్ ప్రక్రియ



ఆన్‌లైన్ కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న సుందర్‌రావు

తుర్కయంజాల్: అభయహస్తం దరఖాస్తుల ఆన్‌లైన్ ప్రక్రియ పకడ్బందీగా చేపడుతున్నామని మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్ తెలిపారు. తుర్కయంజాల్‌లోని సెయింట్ పాల్స్ కళాశాలలో ఏర్పాటు చేసిన ఆన్‌లైన్ కేంద్రాన్ని గురువారం ప్రత్యేక అధికారి సుందర్‌రావు తనిఖీ చేశారు. మున్సిపాలిటీలోని 24 వార్డుల నుంచి మొత్తం 19,362 దరఖాస్తులు వచ్చాయని, వీటిలో గురువారం వరకు 16వేల దరఖాస్తుల ఆన్‌లైన్ నమోదు పూర్తిచేశామని పేర్కొన్నారు. మరో 2 రోజుల్లో మొత్తం ప్రక్రియను పూర్తిచేస్తామని తెలిపారు. మేనేజర్ శ్రీధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పనుల పర్యవేక్షణ

యాచారం: ప్రజాపాలనలో భాగంగా మండలంలోని 24 గ్రామ పంచాయతీల్లో కలిపి వచ్చిన 16,970 అభయ హస్తం దరఖాస్తుల ఆన్‌లైన్ ప్రక్రియ శరవేగంగా సాగుతోంది. అత్యధికంగా ఇంటి స్థలాలు, ఇళ్లు, పింఛన్లు, విద్యుత్ బిల్లుల మాఫీ తదితర పథకాల కోసం ప్రజలు దరఖాస్తు చేసుకున్నారు. ఎంపీడీఓ విజయలక్ష్మి, తహసీల్దార్ శ్రీకాంత్‌రెడ్డి దగ్గరుండి డీటీపీ ఆపరేటర్ల ద్వారా ప్రజాపాలన దరఖాస్తులను కంప్యూటర్లలో ఆన్‌లైన్ నమోదు చేయిస్తున్నారు.

నేడు రక్తదాన శిబిరం

ఆమనగల్లు: ఆమనగల్లు పట్టణంలోని గాంధీ చౌక్ వద్ద శుక్రవారం స్వామి వివేకానంద జయంతి సందర్భంగా ఏబీవీపీ ఆధ్వర్యంలో రక్తదానం శిబిరం నిర్వహిస్తున్నట్లు ఏబీవీపీ నాయకులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. శిబిరంలో ఆరోగ్యవంతమైన యువతీ యువకులు రక్తదానం చేసి ప్రాణదాతలుగా నిలావాలని వారు కోరారు.

ఇబ్రహీంపట్నంలో..

ఇబ్రహీంపట్నం: స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకొని ఏబీవీపీ ఆధ్వర్యంలో శుక్రవారం ఇబ్రహీంపట్నంలోని వైష్ణవీ గార్డెన్‌లో మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు ఆ సంఘం గ్రేటర్ హైదరాబాద్ జాయింట్ సెక్రటరీ వంగ సంజీవరెడ్డి తెలిపారు. విద్యార్థులు, యువకులు రక్తదానానికి ముందుకు రావాలని కోరారు.

క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం



పోటీలను ప్రారంభిస్తున్న రాంపాల్‌నాయక్

ఆమనగల్లు: ఆమనగల్లు మున్సిపాలిటీ పరిధిలోని నుచ్చుగుట్టతండాలో గురువారం జిల్లాస్థాయి క్రికెట్ టోర్నమెంట్‌ను మున్సిపల్ చైర్మన్ రాంపాల్‌నాయక్, మున్సిపల్ బీఆర్‌ఎస్ అధ్యక్షుడు పత్యానాయక్ ప్రారంభించారు. వారంరోజుల పాటు జరిగే ఈ టోర్నమెంట్‌లో పెద్ద సంఖ్యలో జట్లు పాల్గొంటున్నాయని తెలిపారు. క్రీడల్లో గెలుపోటములను సమానంగా స్వీకరించి క్రీడాస్ఫూర్తిని చాటాలని కోరారు. ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ జిల్లా కార్యదర్శి కృష్ణనాయక్, స్థానిక నాయకులు రఘునాయక్, కుమార్‌నాయక్, శంకర్, సీతారం, రాజేశ్, బద్దు, రమేశ్‌నాయక్, జైపాల్, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

పదవీ కాలాన్ని పొడగించాలి

సర్పంచ్ గోదాదేవి

ఆమనగల్లు: రాష్ట్ర ప్రభుత్వం సర్పంచ్‌ల పదవీ కాలాన్ని పొడిగించాలని మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షురాలు, శెట్టిపల్లి సర్పంచ్ ఎగిరిశెట్టి గోదాదేవి కోరారు. ఆమనగల్లు పట్టణంలో గురువారం ఆమె మాట్లాడుతూ.. సర్పంచ్‌ల పదవీకాలాన్ని ఆరు నెలలపాటు పొడిగించాలని కోరారు. సర్పంచ్‌ల పదవీకాలం ఈనెలాఖరుతో ముగియనుందని, సర్పంచుగా గ్రామాభివృద్ధి కోసం సొంత నిధులతో అనేక పనులు చేపట్టడం జరిగిందని.. వాటికి బిల్లులు రాక ఇబ్బందులు పడుతున్నామని ఆమె చెప్పారు.

నేడు ఎమ్మెల్యే పర్యటన

మంచాల: ఈనెల 12న మంచాల మండలంలోని పలు గ్రామాల్లో అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభోత్సవాల్లో ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి పాల్గొంటారని ఎంపీటీసీ సభ్యుల ఫోరం మండల అధ్యక్షుడు ఎడ్మా నరేందర్‌రెడ్డి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. శుక్రవారం ఉదయం 10 గంటలకు చీదేడ్, 11 గంటలకు బోడకొండ, 12 గంటలకు చెన్నారెడ్డిగూడ, మధ్యాహ్నం ఒంటిగంటకు ఆరుట్ల, 2గంటలకు మంచాల, 2:30 గంటలకు తాళ్లపల్లిగూడ, 3 గంటలకు మంచాల తహసీల్దార్ కార్యాలయం వద్ద కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను పంపిణీ చేస్తారన్నారు.

యాచారం మండలంలో..

యాచారం: ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి శుక్రవారం యాచారం మండల పర్యటనకు వస్తున్నట్లు తహసీల్దార్ శ్రీకాంత్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీడీఓ కార్యాలయంలో ఎమ్మెల్యే చేతుల మీదుగా 22 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు పంపిణీ చేయడం జరుగుతుందని ఆయన తెలిపారు.

పాఠశాలల్లో సంక్రాంతి సంబరాలు

ఆమనగల్లు: ఆమనగల్లు మున్సిపాలిటీ ముర్తుజపల్లిలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో గురువారం సంక్రాంతి సంబురాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు మణిపాల్‌రెడ్డి, ఉపాధ్యాయులు ఆంజనేయులు విద్యార్థులకు సంక్రాంతి పండుగ విశేషాలను వివరించారు. భోగి మంటలు వేసి విద్యార్థులు సందడి చేశారు. అనంతరం విద్యార్థులకు వివిధ రకాల ఆటల పోటీలు నిర్వహించి బహుమతులు అందించారు.



కడ్తాల్: విద్యార్థులు వేసిన ముగ్గులను పరిశీలిస్తున్న ఉపాధ్యాయులు

కేజీబీవీ పాఠశాలలో..

కడ్తాల్: మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో సంక్రాతి పండుగను పురస్కరించుకుని విద్యార్థులకు గురువారం ముగ్గుల పోటీలు నిర్వహించారు. పోటీల్లో విజేతలుగా నిలిచిన వారికి పాఠశాల ఎస్‌ఓ అనిత బహుమతులు అందజేశారు. ప్రతి ఒక్కరికి సంక్రాంతి పండుగ శుభాకాంక్షలు తెలిపారు.

నోముల పాఠశాలలో

మంచాల: మండల పరిధిలోని నోముల ప్రాథమికోన్నత పాఠశాలలో సంక్రాంతి సంబురాలను పురస్కరించుకుని గురువారం బాలికలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. ప్రతిభ చాటినవారికి బహుమతులు అందజేశారు. ప్రధానోపాధ్యాయుడు సత్తారి రాజిరెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో...

ఇబ్రహీంపట్నం రూరల్: ఆదిబట్ల మున్సిపాలిటీలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో గురువారం విద్యార్థులు సంక్రాంతి సంబురాలను ఘనంగా జరుపుకున్నారు. ముగ్గుల పోటీలను నిర్వహించారు. గెలుపొందినవారికి బహుమతులు అందజేశారు. ప్రధానోపాధ్యాయులు పరమేష్, ఉపాధ్యాయురాలు బబ్లీ పాల్గొన్నారు .



ఇబ్రహీంపట్నం రూరల్: బహుమతులు అందజేస్తున్న ఉపాధ్యాయులు



ఆమనగల్లు: భోగిమంటల చుట్టూ తిరుగుతున్న విద్యార్థులు



మంచాల: నోముల పాఠశాలలో ముగ్గులు వేస్తున్న విద్యార్థినులు

పేద విద్యార్థులకు అండగా ఉంటాం

మాజీ ఎంపీపీ మర్రి నిరంజన్‌రెడ్డి

ఇబ్రహీంపట్నం: ఇష్టంతో చదవితే లక్ష్యాన్ని సులువుగా ఛేదించవచ్చునని మాజీ ఎంపీపీ, ఆదిబట్ల కౌన్సిలర్ మర్రి నిరంజన్‌రెడ్డి విద్యార్థులకు సూచించారు. ఇబ్రహీంపట్నం ప్రభుత్వ బాలుర, జిల్లా పరిషత్ బాలికల, రాయపోల్, దండుమైలారం, నాగన్‌పల్లి గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతి చదవుతున్న విద్యార్థులకు ఆయన గురువారం స్టడీ మెటీరియల్‌ను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పదిలో మంచి మార్కులు సాధించి పాఠశాలకు, పేరెంట్స్‌కు, గ్రామానికి మంచిపేరు తీసుకురావాలన్నారు. పేద కుటుంబాలకు చెందిన విద్యార్థులు చదువులో మంచిగా రాణిస్తే వారి ఉన్నత విద్యకు తన సహకారం ఉంటుందని నిరంజన్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా మర్రి నిరంజన్‌రెడ్డిని ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. ఆయా కార్యక్రమాల్లో ఇబ్రహీంపట్నం మున్సిపల్ చైర్‌పర్సన్ కప్పరి స్రవంతి, కౌన్సిలర్లు భానుగౌడ్, సర్పంచ్‌లు బల్వంత్‌రెడ్డి, జగన్, ఎంపీటీసీలు అరుణ, జ్యోతి, కాంగ్రెస్ నాయకులు జగదీశ్‌యాదవ్, లక్ష్మణ్‌రావు, కమలాకర్‌రెడ్డి, గౌస్, ఫెరోజ్, కరుణాకర్‌రెడ్డి, సీతయ్య, మనోజ్‌రెడ్డి, ప్రదీప్‌రెడ్డి, ఎంఎస్‌ఆర్ యువసేన సభ్యులు మహేశ్‌గౌడ్, ధనరాజ్, శివగౌడ్, వంశినాయక్, నానిరెడ్డి, కృష్ణ పాల్గొన్నారు.



స్టడీ మెటీరియల్ అందుకున్న విద్యార్థులు

పల్లెలు పచ్చదనంతో వెల్లివిరియాలి

జెడ్పీ చైర్‌పర్సన్ అనితారెడ్డి

తలకొండపల్లి: మనిషి జీవనానికి చెట్లే ఆధారమని జెడ్పీ చైర్‌పర్సన్ తీగల అనితారెడ్డి అన్నారు. గురువారం హైదరాబాద్‌లో జెడ్పీ చైర్‌పర్సన్ అనితా హరినాథ్‌రెడ్డి పుట్టిన రోజు వేడుకలను ఘనంగా జరిపారు. బీఆర్‌ఎస్ నేత సీఎల్ శ్రీనివాసుయాదవ్ ఆమెకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. జెడ్పీ చైర్‌పర్సన్ మాట్లాడుతూ.. నా పుట్టిన రోజును పురస్కరించుకొని ప్రతి ఇంటి పరిసరాల్లో మొక్కలను విరివిగా పెంచి గ్రామాలను పచ్చగా మార్చాలన్నారు. ప్రతి పల్లె పచ్చదనంతో వెల్లివిరియాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.



అనితారెడ్డిని సన్మానిస్తున్న శ్రీనివాస్‌యాదవ్

ఉన్నత శిఖరాలకు చేరుకోవాలి



విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శన

కడ్తాల్: విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఫార్చ్యూన్ బటర్‌ఫ్లై సిటీ సీనియర్ సెకండరీ స్కూల్ వ్యవస్థాపకులు శేషగిరిరావు అన్నారు. ఆ స్కూల్ 13వ వార్షికోత్సవ వేడుకలను గురువారం పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శేషగిరిరావు ఒలంపిక్ టార్చ్ వెలిగించి వార్షికోత్సవ వేడుకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంత విద్యార్థులకు అతి తక్కువ ఫీజులతో అత్యుత్తమ విద్యను అందించాలనే లక్ష్యంతో 13 సంవత్సరాల క్రితం సీబీఎస్‌ఈ సిలబస్‌తో ఈ ప్రాంతంలో పాఠశాలను ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. పాఠశాలలో విద్యార్థులచే నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో పాఠశాల కోఫౌండర్ రమేశ్, ప్రిన్సిపాల్ సంజీవ్‌నాంపల్లి, వైస్ ప్రిన్సిపాల్ రంగారావు, ఉపాధ్యాయులు ఉన్నారు.



వేడుకలను ప్రారంభిస్తున శేషగిరిరావు



జేసీబీతో గుంతల పూడ్చివేత పనులు చేపడుతున్న సిబ్బంది

గుంతలు పూడ్చారు

సాక్షి ఎఫెక్ట్..

బడంగ్‌పేట్: రోడ్డంతా గుంతలే.. శీర్షికన సాక్షి దినపత్రికలో గురువారం ప్రచురితమైన కథనానికి బడంగ్‌పేట మునిసిపల్ కార్పొరేషన్ అధికారులు స్పందించారు. కొత్త మునిసిపల్ కార్పొరేషన్ నుంచి అల్మాస్‌గూడ రాజీవ్‌గృహకల్ప వెళ్లే ప్రధాన దారిలో ఉన్న 23, 28 డివిజన్లలోని మారుతినగర్ రోడ్డు గుంతల మయంగా మారింది. డ్రైనేజీల పేరుతో అడ్డంగా తవ్విన బీటీ రోడ్డుపై పెద్ద గుంతలు పడటంతో వాహనదారులు, పాదచారులు, ద్విచక్రవాహనాలు తరచూ ప్రమాదాలకు గురవుతున్నారు. ఈ విషయమై సాక్షిలో కథనం రావడంతో స్పందించిన అధికారులు జేసీబీతో తరలివచ్చి గుంతలను పూడ్చివేయించారు. పదిహేను రోజుల్లో సీసీ నిర్మాణ పనులు చేపడుతామని స్పష్టంచేశారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజలు, కాలనీవాసులు, వాహనదారులు సాక్షికి కృతజ్ఞతలు తెలిపారు.

ఘనంగా ఓబన్న జయంతి



ఓబన్న జయంతి వేడుకలో నాయకులు

తుర్కయంజాల్: స్వాతంత్ర సమరయోధుడు వడ్డె ఓబన్న జయంతి వేడుకలను తుర్కయంజాల్‌లో వడ్డెర వృత్తిదారుల సంఘం ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు కుంచం వెంకటకృష్ణ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పల్లపు విష్ణున్ మాట్లాడుతూ.. ఓబన్న , ఉయ్యాల వాడ నర్సింహరెడ్డికి సర్వసైన్యాధ్యక్షుడిగా ఉండి వీరోచిత పోరాటం చేశాడని బ్రిటీష్ ఇండియా కంపెనీకి వ్యతిరేకంగా నల్లమల ప్రాంతంలోని వడ్డెరలు, బోయలు, చెంచులు, మెదలైన సంచార జాతులకు నాయకత్వం వహించారని గుర్తుచేశారు. అనంతరం ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు భిక్షపతి, శ్రీనివాస్, సత్యం, వినయ్, సైమన్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ ఆవిష్కరణలు చేపట్టాలి

సైన్స్ ఫెయిర్‌లను తిలకించిన ఉపాధ్యాయులు

మాడ్గుల: మాడ్గుల మండలం ఇర్విన్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో గురువారం నిర్వహించిన జిల్లాస్థాయి వైజ్ఞానిక ప్రదర్శనలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ఉపాధ్యాయులు ఘనంగా సత్కరించారు. ఇబ్రహీంపట్నంలోని గురుకుల విద్యాపీఠంలో రెండు రోజులపాటు నిర్వహించిన డిస్ట్రిక్ లెవల్ బాల్ వైజ్ఞానిక ప్రదర్శనలో జిల్లా వ్యాప్తంగా 330 పైచిలుకు ఎగ్జిబిట్స్‌లో జెడ్పీహెచ్‌ఎస్ ఇర్విన్ విద్యార్థులు పాల్గొని ఉత్తమ ప్రదర్శన కనబరిచారు. అప్పర్ ప్రైమరీ విభాగంలో 'అగ్రికల్చర్ సబ్ దెమ్‌లో కంట్రోల్ బై బీ వెక్టార్స్' అనే ప్రాజెక్టు జిల్లాస్థాయి ద్వితీయ బహుమతి కైవసం చేసుకుంది. విద్యార్థి సూదిని నచ్చికేత్ రెడ్డి మరియు గైడ్ టీచర్ కరుణాకర్ రెడ్డి, జిల్లా విద్యాధికారి సుసిందార్ రావు చేతులమీదుగా ప్రశంసాపత్రం, బహుమతి అందుకున్నారు. ఈ నేపథ్యంలో పాఠశాల ఆవరణలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను పలువురు అభినందించారు.



మాడ్గుల: విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేసిన ఉపాధ్యాయులు

భవిష్యత్‌కు బాటలు..

కడ్తాల్: వైజ్ఞానిక ప్రదర్శనలతో విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీయవచ్చని లయన్స్ క్లబ్ ఆఫ్ ఆమనగల్లు అధ్యక్షుడు వెంకటేశ్వర్లుగౌడ్ అన్నారు. మండల కేంద్రంలోని ప్రగతి పాఠశాలలో గత రెండు రోజులుగా నిర్వహించిన వైజ్ఞానిక ప్రదర్శన గురువారంతో ముగిసింది. ఈ ప్రదర్శనలను తిలకించిన వెంకటేశ్వర్లుగౌడ్ మాట్లాడుతూ.. వైజ్ఞానిక ప్రదర్శనలు విద్యార్థుల బంగారు భవిష్యత్‌కు బాటలు వేస్తాయని భవిష్యత్తులో శాస్త్రసాంకేతిక రంగాల్లో నూతన ఆవిష్కరణలు చేసేందుకు ఇలాంటి కార్యక్రమాలు ఎంతగానో దోహదపడుతాయని అన్నారు. అనంతరం పాఠశాల కరస్పాండెంట్ సువర్ణ గోవర్ధన్‌రెడ్డి ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. పాఠశాల ప్రిన్సిపాల్ బీను, ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉన్నారు.



కడ్తాల్: ప్రదర్శనలను తిలకిస్తున్న వెంకటేశ్వర్లుగౌడ్

ఆధార్ సెంటర్ ఏర్పాటు చేయండి

ఆమనగల్లు: ఆమనగల్లు సింగిల్‌విండో కార్యాలయంలో ఆధార్ సెంటర్ ఏర్పాటు చేయడానికి అనుమతి ఇవ్వాలని సింగిల్‌విండో చైర్మన్ గంప వెంకటేశ్ కోరారు. ఆమనగల్లు తహసీల్దార్ లలితకు ఈమేరకు వెంకటేశ్ పంపిన వినతిపత్రాన్ని సింగిల్‌విండో కార్యాలయ సీఈఓ దేవేందర్ అందించారు. ఆమనగల్లు పట్టణంలో ఆధార్ కేంద్రం లేకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని చైర్మన్ గంప వెంకటేశ్ వినతి పత్రంలో వివరించారు. సింగిల్‌విండో కార్యాలయంలో ఆధార్‌సెంటర్ ఏర్పాటు చేయడానికి ప్రభుత్వం అనుమతి ఇవ్వాలని కోరారు. పద్మాకర్‌రెడ్డి, అల్లాజీ పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం

మహేశ్వరం: క్రీడలు శారీరక, మానసిక ఉల్లాసానికి ఎంతో దోహదపడుతాయని అమీర్‌పేట్ గ్రామ సర్పంచ్ శ్రీశైలం గౌడ్ పేర్కొన్నారు. గురువారం మండల పరిధిలోని అమీర్‌పేట్ గ్రామంలో ఏపీఎల్ (అమీర్‌పేట్ ప్రీమియర్ క్రికెట్ లీగ్) పోటీలను స్థానిక ఎంపీటీసీ, ఉప సర్పంచ్, వార్డు సభ్యులు, క్రీడాకారులతో కలిసి పోటీలను ఆయన ప్రారంభించారు. ఉప సర్పంచ్ పోతుల నర్సింగ్, బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు రాయప్ప, కాంగ్రెస్ నాయకులు యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

అయ్యప్ప పడిపూజ

ఇబ్రహీంపట్నం రూరల్: అయ్యప్ప స్వామి మహా పడిపూజను ఆదిబట్ల మున్సిపాలిటీ పరిధిలోని రాందాస్‌పల్లిలో మాజీ సర్పంచ్ ఏనుగు సూజాత గురువారం ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి తనయుడు అభిషేక్‌రెడ్డి విచ్చేసి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. అయ్యప్ప స్వాములు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.



పూజలు నిర్వహిస్తున్న సుజాతశ్రీనివాస్‌రెడ్డి దంపతులు



అక్రమ నిర్మాణం కూల్చివేత

ఇబ్రహీంపట్నం: ఇబ్రహీంపట్నం రెవెన్యూ పరిధిలోని 815 సర్వే నంబర్‌లో అక్రమంగా నిర్మిస్తున్న ఇంటి నిర్మాణాన్ని గురువారం రెవెన్యూ అధికారులు కూల్చివేసినట్లు తహసీల్దార్ అన్వర్ తెలిపారు. ఎలాంటి అనుమతులు లేకుండా ప్రభుత్వ, అసైన్డ్ భూముల్లో నిర్మాణాలు చేపడితే కూల్చివేతలు తప్పవని ఆయన హెచ్చరించారు.

రోడ్లన్నీ అధ్వానం

రాకపోకలకు అంతరాయం

- పట్టించుకోని జీహెచ్‌ఎంసీ అధికారులు
- ఇబ్బందుల్లో వాహనదారులు, ప్రజలు

హుడాకాంప్లెక్స్: రహదారులన్నీ అధ్వానంగా మారాయి. కాలనీలు, బస్తీలనే తేడా లేకుండా రోడ్లన్నీ ఘోరంగా ఉన్నాయి. కొన్ని ప్రాంతాల్లో రోడ్లు కంకర తేలి రాకపోకలకు ఇబ్బందులు కలిగిస్తుంటే.. మరికొన్ని ప్రాంతాల్లో పెద్ద పెద్ద గుంతలు ఏర్పడి ప్రమాదాలకు కారణవుతున్నాయి. అయినా గుంతలు పడిన రహదారులకు మరమ్మతులు చేసే విషయంలో అధికార యంత్రాంగం తీరు విమర్శలకు దారితీస్తోంది. దీంతో వాహనదారులు, పాదచారులు రాకపోకలు సాగించాలంటే ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

- వేంకటేశ్వరకాలనీ, బాపూనగర్, అంబేడ్కర్‌నగర్, భగత్‌సింగ్ నగర్ తదితర కాలనీల్లోని సీసీ రోడ్లు పాడైనా జీహెచ్‌ఎంసీ అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోవటం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు.
- ముక్కుపిండి పన్నులు వసూలు చేసే అధికారులు కనీస వసతులను కల్పించే విషయంలో నిర్లక్ష్యం వహిస్తున్నారని మండిపడుతున్నారు. అభివృద్ధి పనుల కోసం తవ్వకాలు జరిపి పనులు పూర్తయిన వెంటనే రోడ్లకు ప్యాచ్‌వర్క్‌లు చేయకుండా వదిలేస్తున్నారు.
- వేంకటేశ్వర కాలనీ రోడ్డు నంబర్-6లో రహదారి మధ్యలో గుంతలు పడి నడలేక ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బాపూనగర్ శివాలయం ముందు కంకర తేలిన రోడ్డుపై మురుగు నిలుస్తుందని, మురుగు నుంచి వచ్చే దుర్గంధం, దోమలతో ఇబ్బందులు తప్పడం లేదని ఆయా కాలనీలవాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



వేంకటేశ్వర కాలనీలో ధ్వంసమైన రోడ్డు